## క్లుప్తంగా

### నేడు మంత్రి అంబటి రాంబాబు పర్యటన

**సత్తెనపల్లి:** పట్టణంలోని 2, 3 వార్డుల్లో శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటలకు ద్విచక్ర వాహన ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు రాజుపాలెం మండలం దేవరంపాడు వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

### నీటిని పొదుపుగా వాడుకోవాలి



**నకరికల్లు:** నీటిని పొదుపుగా వాడుకొని వృథాను అరికడదామని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పఠాన్ మల్లిక సూచించారు. అంతర్జాతీయ జల దినోత్సవాన్ని చేజర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నీటి ప్రాముఖ్యతను వివరించే నినాదాలు చేస్తూ విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. విద్యార్థి దశ నుంచే మొక్కలను పెంచడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేరా మోహన్‌రావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకట్రావు, షేక్.హబీబ్ పాల్గొన్నారు.

### బొల్లవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



**బొల్లవరం(ముప్పాళ్ళ):** బొల్లవరం గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. ఆయా విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని 319 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు జయకృష్ణ తెలిపారు. 45 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 20 మందికి అవసరమైన కళ్లజోళ్లు అందించారు. గర్భిణులకు, బాలింతలకు అవసరమైన టీకాలు వేశారు. వైద్యులు కె.అలేఖ్య(జనరల్), ఎం.సౌజన్య(గైనకాలజిస్ట్), బి.రాజశేఖరరెడ్డి(కంటి వైద్య నిపుణులు)లు పాల్గొని వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

### ప్రతి వీధిలో రేషన్ పంపిణీ చేయాలి



**నకరికల్లు:** ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి రేషన్ పంపిణీని ప్రారంభించాలని రేషన్ డీలర్లకు తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. రేషన్‌డీలర్లు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల కల్లా రేషన్ పంపిణీని ప్రారంభించాలని చెప్పారు. గ్రామంలోని ప్రతి వీధికి వెళ్లి రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు సరుకులు వృథా కాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ యువరాజ్, ఆర్ఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనదారుడి మృతి



**నకరికల్లు:** ఇనుప సిగ్నల్ బోర్డుకు ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చేజర్ల గ్రామం వద్ద జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈపూరు మండలం ఇనిమెళ్ల గ్రామానికి చెందిన చింతల రామకోటేశ్వరరావు (54) కంది, మినుము తదితర అపరాలు నూర్పిడి చేసే యంత్రాన్ని నిర్వహిస్తుంటాడు. సాయంత్రం రైతుల వద్దకు డబ్బులు వసూలు చేస్తుంటాడు. గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లే రైతులు చేజర్ల సమీపంలోని చిన్న కాలువలో పడి ఉండటాన్ని గుర్తించి, సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ వి.కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న సిగ్నల్ బోర్డును ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. మృతునికి భార్య ఈశ్వరమ్మ, ముగ్గురు పిల్లలున్నారు.

# మున్సిపాలిటీ మురిసేలా

- పారిశుద్ధ్య కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు
- ఠంఛనుగా జీతాల చెల్లింపు
- చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనాలు
- పట్టణంలో సులభమైన చెత్త సేకరణ
- కనిపించని చెత్తకుప్పలు, మురుగు నిల్వలు

**నాడు**

చాలీచాలని జీతాలు .. అవి కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి.. సెలవు పెడితే ప్రజల ఆరోగ్యానికి చేటు.. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినా పనికి తగ్గ వేతనం లేని దుస్థితి.. చెత్త తరలింపునకు వాహనాలు అరకొరే. ఇదీ ఐదేళ్ల కిందటి వరకు పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు.

**నేడు**

పాలన మారింది. పారిశుద్ధ్య కార్మికుల నెల వేతనం రూ. 12 వేల నుంచి రూ. 21 వేలకు పెరిగింది. ప్రతి నెలా ఒకటో తేదీనే చేతికి జీతం అందుతోంది. శాశ్వత పారిశుద్ధ్య కార్మికుడికి ఏడాదికి మూడు జతల యూనిఫారాలు, వీరితో పాటు ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఏడాదికి 12 సబ్బులు, నాలుగున్నర లీటర్ల కొబ్బరి నూనె పంపిణీ చేస్తున్నారు. తడి, పొడి చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనాలు కేటాయించడంతో కార్మికుల పని సులభతరమైంది. చెత్త తరలింపు వేగవంతంగా సాగుతోంది. పట్టణం పరిశుభ్రంగా కనిపిస్తోంది.

**సత్తెనపల్లి మున్సిపాలిటీలో ఇలా..**

| | |
|---|---|
| పట్టణంలో వార్డులు- | 31 |
| గృహాలు- | 15,938 |
| ప్రతీ రోజు చెత్త ఉత్పత్తి - | 22 మెట్రిక్ టన్నులు |
| పిడుగురాళ్ళ మహీంద్రా అండ్ మహీంద్రాకు తరలింపు- | 6 మెట్రిక్ టన్నులు |
| గుంటూరు నాయుడుపేట జిందాల్‌కు తరలింపు- | 16 మెట్రిక్ టన్నులు |
| శాశ్వత కార్మికులు- | 24 మంది |
| ఔట్ సోర్సింగ్ కార్మికులు- | 136 మంది |
| బాబ్‌కాట్- | 1 |
| కంపాక్టర్లు- | 3 |
| ట్రాక్టర్లు- | 5 |
| ఆటోలు- | 9 |
| ట్రాలీ బండ్లు- | 53 |



రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

**సత్తెనపల్లి:** పారిశుద్ధ్య కార్మికులు .. ఆరోగ్య సమాజ నిర్మాణానికి పాటుపడే నిరంతర శ్రామికులు. ప్రతి రోజు వేకుజామునే మేల్కొంటారు. జన సంచారం ఆరంభమయ్యేసరికి పట్టణాన్ని పరిశుభ్రం చేస్తారు. షిఫ్టుల వారీగా పరిశుభ్రతలో మమేకమవుతారు. ఐదేళ్ల కిందటి వరకు వీరి జీవితాలు అగమ్యగోచరం. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొచ్చేవారు. కష్టం వస్తే ఆదుకునే వారే కరువైన దీనస్థితి. ఈ దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో వారి బతుకులకు వెలుగు దారి కనిపించింది. జీతాలు పెరిగాయి. యూనిఫారాలు, సబ్బులు, ఆయిల్ ఠంఛన్‌గా అందుతున్నాయి. వారి కుటుంబాల్లో జీవన ఉన్నతి స్పష్టంగా కనిపిస్తోంది. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా కొత్త వాహనాలను ప్రభుత్వం సమకూర్చడంతో కార్మికుల పని కూడా సులభతరమైంది. సత్తెనపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్మిక లోకం ముందుకు సాగుతోంది.



ఏరియా వైద్యశాల ఎదుట చెత్త తొలగింపు..

### విధులకు 'క్లాప్స్' కొట్టాల్సిందే..

సత్తెనపల్లి పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు పట్టణంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. మురుగు కాలువలు శుభ్రపరుస్తున్నారు. ప్రభుత్వ సమకూర్చిన కొత్త వాహనాలతో చెత్తను తరలిస్తున్నారు. ట్రాక్టర్లు, కంపాక్టర్, ఆటోలు, ట్రాలీ బళ్లను ప్రభుత్వం కేటాయించడంతో చకచకా పని పూర్తవుతుందని కార్మికులు చెబుతున్నారు.

# సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

- నేటితో అంగన్వాడీ కేంద్రాల్లో పక్షోత్సవాలు ముగింపు
- గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు
- బలవర్ధక ఆహారంతో లబ్ధిదారుల్లో పెరుగుతున్న హెచ్‌బీ శాతం
- నియోజకవర్గంలో 301 అంగన్‌వాడీ కేంద్రాలు



పట్టణంలోని అంగన్‌వాడీ ప్రీ స్కూల్ భవనం



పౌష్టికాహార పక్షోత్సవంలో అంగన్‌వాడీలు (ఫైల్)

**సత్తెనపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. పలు రకాల పోషకాహార పదార్థాలతో సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. పోషకాహార ఫలితాలను వివరించేందుకు, విధానాలను మెరుగుపరిచేందుకు ఏటా మార్చి 9 నుంచి 23వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలను (పోషణ్ పక్వాడా) నిర్వహిస్తోంది. ప్రతి రోజు అంగన్ వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రాముఖ్యతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

**పోషకాహార కిట్లు పంపిణీ..**

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు బియ్యం మూడు కిలోలు, కందిపప్పు కేజీ, వంటనూనె అర లీటరు, కోడిగుడ్లు 25, పాలు ఐదు లీటర్లు, రాగి పిండి రెండు కిలోలు, అటుకులు కేజీ, బెల్లం, చిక్కి, ఖర్జూరాలు పావు కిలో చొప్పున ప్రతి నెల అందజేస్తున్నారు.

పిల్లలకు బాలామృతం రెండున్నర కిలోలు, కోడిగుడ్లు 25, పాలు రెండున్నర లీటర్లు పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 301 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా బాలింతలు 1,634 మంది, గర్భిణీలు 1,914 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో ఏడాదిలోపు చిన్నారులు 1,902 మంది, మూడేళ్లలోపు చిన్నారులు 7,162 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలు 5,656 మంది ఉన్నారు.

**పక్షోత్సవాలు ఇలా...**

పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యం, చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన, చేతుల శుభ్రత వల్ల కలిగే లాభాలు, పోషకాహార లోపం పై అవగాహన కార్యక్రమాలు, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) వివరించటం, ఖేల్ ఔర్ పఠో ఈవెంట్ ఏర్పాటు, వంటల పోటీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన, రక్తహీనత గర్భిణీలు గుర్తింపు, గర్భిణీలకు నిరంతరం చెకప్‌లపై అవగాహన, ప్రీ స్కూల్ తల్లిదండ్రుల ప్రమేయం వివరించడం, ఆరోగ్య పరీక్ష శిబిరాలు, నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ, స్వచ్ఛత దినోత్సవం, బొమ్మల తయారీ, యోగ పై గర్భిణీలకు అవగాహన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

## వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

**నరసరావుపేట:** ఒకటో వార్డులో ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో మురుగు కాలువల్లోని పూడిక తీయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలసి ఒకటవ వార్డులోని ట్రంకు పెట్టెల బజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు కాలువలు ప్రధాన సమస్యగా ఉన్నాయని, కొత్తగా కాలువలు నిర్మించాలని, అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) నీరు మ్యాన్‌హోల్ నుంచి బయటికి వస్తుందని ఆ సమస్య పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఈ ప్రదేశం ఎత్తు తక్కువగా ఉండటం వల్ల నీరు మొత్తం ఇటు రావడం జరుగుతోందన్నారు. అదేవిధంగా కాలువలు కూడా పాతవి కావటం వలన సమస్య ఏర్పడిందన్నారు. వెంటనే యూజీడీ మిషన్ తెప్పించి మ్యాన్‌హోల్ నుంచి నీరు బయటకు రాకుండా వాటన్నింటిని శుభ్రం చేయిస్తామన్నారు. నూతన కాలువలు నిర్మాణానికి ప్రతిపాదన రూపొందించాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు సూచించారు. మున్సిపల్ డీఇ ఓలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇనస్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రామకోటయ్య పాల్గొన్నారు.



ఒకటో వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

## గాయపడ్డ మార్టూరు వాసి మృతి

**యడ్లపాడు:** అసలే అనారోగ్య సమస్య.. అపై రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్స్ సమీపంలో చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఆటో, అలాగే స్కూటీని కారు వెనుక నుంచి ఢీకొన్న విషయం విదితమే. బాపట్ల జిల్లా మార్టూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ సుమిత్రా బాయి సమీప బంధువు జస్సావత్ పెదమంత్రు నాయక్ అనారోగ్యంతో గురువారం గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొంది కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలు ఇంటికి వెళ్తున్న క్రమంలో తిమ్మాపురం హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలోని వారితో పాటు స్కూటీపై వ్యక్తి కూడా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడి చిలకలూరిపేట ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పెదమంత్రు నాయక్ (73) అదేరోజు రాత్రి మృతి చెందాడు. మనవడు భుక్యా వినోద్ ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ జె.శ్యామేల్ రాజీవ్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా, మార్టూరు సుగాలీ కాలనీలో అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## రైల్వే ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

**వినుకొండ(నూజెండ్ల):** రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు విఠంరాజుపల్లి సమీపంలోని బాలాజీ ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 24 ఆదివారం జరిగే ఉచిత అవగాహన సదస్సు, ఉచిత కోచింగ్‌కు ఎంపిక ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7702892288, 8341821710 నంబర్లను సంప్రదించాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెదకూరపాడు:** పెదకూరపాడు, 75త్యాళ్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో శనివారం మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నేడు నేతి వెంకన్నస్వామి కల్యాణం

**రాజుపాలెం:** మండలంలోని దేవరంపాడు కొండపై వేంచేసి ఉన్న శ్రీ నేతి వెంకన్న స్వామి రెండవ శనివారం తిరుణాళ్ల అత్యంత వైభవంగా జరుగనుంది. స్వామి వారి కల్యాణం కనుల పండుగగా నిర్వహించనున్నట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని పేర్కొన్నారు.

### మూడు గ్రామాల్లో పోలీసు కవాతు

**నకరికల్లు:** ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు అన్నారు. చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట గ్రామాల్లో శుక్రవారం పోలీస్ కవాతు నిర్వహించారు. పోలీస్ సైరన్ మోగిస్తూ సీఐఎస్ఎఫ్ బలగాలు గ్రామాల్లో కవాతు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజల ధైర్యాన్ని నింపేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎస్ఐ పి.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కండ్లకుంటలో పోలీసుల కవాతు

# వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

**అచ్చంపేట:** వైఎస్సార్ సీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. అనేక మంది టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు పార్టీలోకి క్యూ కడుతున్నారు. తాజాగా అచ్చంపేటకు చెందిన టీడీపీ, జనసేన యువకులు గురువారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పల్లె కొండలరావు, తురక సాయిచరణ్, గుంజి జగన్, గుంజి రేణుక, చింపాలపాటి గోపాల్, గుంజి గోపి, కొరంపల్లి గోపి, కె.శ్రవణ్‌కుమార్, భూక్యా రామనుజనాయక్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా తన వద్దకు రావచ్చని చెప్పారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

**తప్పు తెలుసుకుని..**

**క్రోసూరు:** టీడీపీలో చేరిన అందుకూరు గ్రామం వైఎస్సార్ సీపీ కార్యకర్త సొంత గూటికి చేరారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. దుగ్గి రవిని టీడీపీ నాయకులు మభ్యపెట్టి ఆ పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ టీడీపీ ప్రలోభాలకు ఆకర్షితుడినై పార్టీ మారానని, కానీ వెంటనే తప్పు తెలుసుకొని తిరిగి వైఎస్సార్ సీపీలోకి తిరిగొచ్చినట్లు చెప్పారు. జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, షేక్ ఖాదర్, అందుకూరు గ్రామ సర్పంచ్ కుమారుడు జంగా నవీన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిల్కా పెద్దబాబు పాల్గొన్నారు.

**సొంతగూటికి ఆటోయూనియన్ నాయకుడు**

**అమరావతి:** టీడీపీ నాయకుల మాయమాటలకు లోనై గురువారం టీడీపీలో చేరి మోసపోయానని గ్రహించిన అమరావతి ఆటోయూనియన్ నాయకుడు సింగంశెట్టి పెద రాంబాబు సొంత గూటికి చేరారు. శుక్రవారం సాయంత్రం అమరావతి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సింగంశెట్టి పెద రాంబాబుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను, టీడీపీ నేతలు ప్రలోభాలకు గురిచేసి, పార్టీలోకి చేర్చుకోవాలని చూస్తున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, ఆలా లక్ష్మీనారాయణ, రోశిబాబు పాల్గొన్నారు.

## ఆరామ క్షేత్రం భవనం ప్రారంభం

**సత్తెనపల్లి:** పట్టణంలోని అచ్చంపేట రోడ్డులోని కూరపాటి రాఘవులు, బాపమ్మ దాతృత్వంతో నిర్మించిన ప్రాంగణంలో ఆర్యవైశ్యులు అపరకర్మలు, ఆరామ క్షేత్రం, పితృయజ్ఞం పరిసర ప్రాంత ఆర్యవైశ్యులకు పది వసతి గదులు, వైకుంఠ సమారాధన ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఆరామ క్షేత్ర భవన గృహ ప్రవేశం చేశారు. పూజా కార్యక్రమాల్లో నిర్మాణ దాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శివపార్వతుల శాంతి కల్యాణం నిర్వహించారు. నిర్మాణానికి సహకరించిన గుండా పూర్ణ దంపతులను, ఇతర దాతలను సత్కరించారు. ఆర్య వైశ్య చలివేంద్ర సంఘ అధ్యక్షుడు శింగరి మధుసూధనరావు, ఉపాధ్యక్షుడు మాడా నాగరమేష్, అదనపు ఉపాధ్యక్షుడు అన్నా నాగ వెంకట సుమన్ బాబు, కార్యదర్శి తోమ్మండ్రు సత్యనారాయణ, కోశాధికారి కనుమర్లపూడి సుబ్బారావు, ఉప కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి వ్రతంలో ఆర్యవైశ్య నాయకులు

## ఎన్నికల కోడ్ అమలుపై స్పెషల్ డ్రైవ్

**ముప్పాళ్ళ:** మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల కోడ్ అమలుపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు పూర్తిగా రంగులు వేయించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలకు నేటికీ పసుపు రంగు వేసి ఉండటాన్ని గమనించి, వాటికి పూర్తిగా తెలుపు రంగు వేయించారు. ఆయా గ్రామాల్లో బెంచీలపైన, శ్మశానాలపైన ఉన్న రాజకీయ నాయకుల పేర్లపైన రంగులు వేయించి, ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు జరిపారు. 13 అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కోడ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, ఎఎస్సై రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తొండపిలో అంగన్‌వాడీ కేంద్రానికి రంగు వేయిస్తున్న నోడల్ ఆఫీసర్ సాంబశివరావు

## రేపు వాల్మీకి మహర్షి విగ్రహ, దేవాలయ ప్రతిష్ట

**మాచవరం:** ఈనెల 24న మండలంలోని పిన్నెల్లి గ్రామంలో వాల్మీకి బోయ కాలనీలో వాల్మీకి మహర్షి దేవాలయ ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేద పండితులచే యజ్ఞశాల ఏర్పాటు చేసి ప్రత్యేక శాంతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కావున పరిసర గ్రామాల ప్రజలు కార్యక్రమానికి విచ్చేసి, జయప్రదం చేయాలని కోరారు.

### ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి

**వినుకొండ(నూజెండ్ల) :** శాలివాహన చక్రవర్తి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాలివాహన సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు పొరెళ్ల రమేష్, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు గొట్టం గోవిందరాజులు డిమాండ్ చేశారు. వినుకొండ మండలంలోని కుమ్మరిపాలెం గ్రామంలో శుక్రవారం శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్థలం కేటాయించి శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శాలివాహన చక్రవర్తి గొప్పతనం గురించి కొనియాడారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, కార్యదర్శి మద్దికుంట ఆదినారాయణ, కోశాధికార్లి లక్ష్మయ్య, గ్రామ పెద్దలు గురజాల రంగనాయకులు, మన్నేపల్లి చిన్న వెంకటేశ్వర్లు, అంకారావు, పుల్లారావు, ఉబ్బారావు, పలుకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

